క్లుప్తంగా

సన్నబియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్‌దే


భోజనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి: పేదలకు సన్నబియ్యం అందిస్తున్న ఘనత దేశంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతోందని మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. పట్టణానికి చెందిన అతియా బేగం ఇంట్లో ఆదివారం నాయకులతో కలిసి సన్నబియ్యంతో భోజనం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఖుత్బుద్దీన్, అందె మారుతి, రాజ్‌కుమార్, రహీముద్దీన్, అనాస్, మదర్ తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


తాటిపల్లిలో మన్‌కీబాత్ వీక్షిస్తున్న నాయకులు

మల్యాల: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని, బీజేపీ పాలనలో దేశం అభివృద్ధి తీరును వివరించాలని భారతీయ జనతా పార్టీ సంచార్ సంయోగి ఉప్పు రాంకిషన్ అన్నారు. మండలంలోని తాటిపల్లిలో బీజేపీ మండలాధ్యక్షుడు గాజుల మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు ఆధ్వర్యంలో ఆదివారం బూత్ సభ్యులతో కలిసి మన్‌కీ బాత్ వీక్షించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా రాచర్ల రాములు, పిల్లి రాజశేఖర్, మల్లేశం, కంచర్ల నర్సయ్య, బాలే గంగస్వామి పాల్గొన్నారు.
కథలాపూర్: పహల్గాం దాడి నేపథ్యంలో దేశప్రజలు ఐకమత్యంగా ఉండాలని ప్రధాని మోదీ సూచించారు. ఆదివారం మన్ కీ భాత్ కార్యక్రమంలో భాగంగా ప్రధానీ మోదీ ప్రసంగించగా.. కథలాపూర్ మండల బీజేపీ శ్రేణులు వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, నాయకులు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, గూడూరి గణేశ్, ప్రతాప్, మహేశ్, శ్రీకర్ పాల్గొన్నారు.

ధర్మపురికి చేరిన సైకిల్ యాత్ర


ధర్మపురికి చేరిన సైకిలిస్టులు

ధర్మపురి: పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యం కోసం సైక్లింగ్ చేస్తున్న విశ్రాంత జవాన్లు ఆదివారం ధర్మపురి పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. కరీంనగర్‌కు చెందిన రిటైర్డు ఆర్మీ జవాన్లు సైకిల్‌యాత్రతో పుణ్యక్షేత్రాలను సందర్శించాలని నిశ్చయించుకున్నారు. మొదట కొండగట్టు అంజన్నను దర్శించుకుని అక్కడి నుండి ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామి వారిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి గూడెం సత్యనారాయణ స్వాములను దర్శించుకుంటామని తెలిపారు. సైకిల్‌యాత్ర ద్వారా ఆరోగ్యం బలపడడంతో పాటు పర్యావరణం మెరుగుపడుతుందని తెలిపారు.

క్రికెట్ కిట్లు అందజేత


క్రికెట్ కిట్లు ఇస్తున్న నరేశ్, నాయకులు

మేడిపల్లి: మండలంలోని కాచారంలో నిర్వహిస్తున్న పానుగంటి సాయబ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రికెట్ టీం లకు మన్నెగూడెం మాజీ సర్పంచ్ తేలు నరేశ్ ఆదివారం క్రికెట్ కిట్లు అందజేశారు. యువత ఫోన్లకు బానిసలు కాకుండా ఆటలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఏనుగు రమేశ్ రెడ్డి, కాచారం మాజీ సర్పంచ్ చిట్యాల సరేశ్, నాగరాజు, బొమ్మెన ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో కూల్.. కూల్‌గా..!

- గ్రామాల్లో పెరిగిన కూలర్ల వినియోగం
- ఉష్ణోగ్రతలు పెరగడంతో కూలర్ల దుకాణాలకు గిరాకీ
- ధరలు అందుబాటులో ఉండడంతో డిమాండ్


మల్లాపూర్ కూలర్ల దుకాణంలో అమ్మకానికి సిద్ధంగా కూలర్లు

మల్లాపూర్: ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కూలర్లు, ఏసీల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే కూలర్ల దుకాణాలు కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నాయి. ఏసీలను ధనవంతులు ఆర్థిక స్థోమత ఉన్నవారు మాత్రమే కొనుగోలు చేస్తుండగా.. ఎగువ, దిగువ మధ్యతరగతి నిరుపేదలు కూలర్లను కొంటున్నారు. స్థానికంగానే తయారు కావడం మిగతా ఫైబర్ కూలర్ల కంటే తక్కువ ధరకు వస్తుండడంతో గిరాకీ పెరిగింది.

స్థానికంగానే తయారీ..
వేసవిలో జగిత్యాల జిల్లా వ్యాప్తంగా దాదాపు 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు శీతలీకరణ ఉపకరణాలు అయిన కూలర్లు, ఏసీలు ఇంటికి తీసుకువస్తారు. జిల్లాలో సామాన్య ప్రజానీకం తమ స్తోమతకు తగ్గట్టుగా కూలర్లను ఖరీదు చేస్తారు. ఒకసారి కొనుగోలు చేస్తే వచ్చే వేసవికాలం వరకు చిన్నపాటి రిపేర్ చేసుకుంటే తిరిగి కొత్త దానిలా పనిచేస్తుండడంతో వీటి వైపే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఫైబర్ కూలర్లతో పోలిస్తే అసెంబుల్డ్ కూలర్లు(ఇనుప రేకులతో తయారీ చేసిన ఐరన్ కూలర్లు) ఎక్కువ చల్లదనాన్ని సైతం ఇవ్వడంతో వీటికి డిమాండ్ ఎక్కువగా ఉంది.

యువతకు ఉపాధి..
స్థానికంగానే తయారు చేస్తుండడం వలన ఎంతో మంది యువతకు ఉపాధి అవకాశాలు లభ్యమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఎంతో మంది వీటి తయారీలో నైపుణ్యం కలిగి ఉండడం, ఎడారి కూలర్లకు జిల్లాలో ఉన్న డిమాండ్ పెరిగింది. వేసవి వస్తే నైపుణ్యం గల యువత తయారీ యూనిట్లతో పాటు కూలర్ రిపేరింగ్ షాపులతో ఉపాధి పొందుతున్నారు.

అందుబాటు ధరల్లో..
వివిధ బ్రాండ్ కంపెనీలకు చెందిన ఫైబర్ కూలర్లు మార్కెట్‌లో రూ.10 వేల నుంచి రూ.25వేల వరకు లభ్యం అవుతున్నాయి. అయితే అసెంబుల్డ్(ఐరన్) కూలర్లు రూ.1800 నుంచి రూ.6వేల వరకు మాత్రమే ఖరీదు చేస్తున్నాయి. ఫైబర్ బ్రాండ్ కంపెనీ కూలర్ల కన్నా ఎక్కువ చల్లదనాన్ని ఇస్తుండడం, సామాన్యులకు అందుబాటు ధరల్లో ఉండడంతో వేసవి వస్తే కూలర్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి.

గిరాకీ బాగా పెరిగింది



కొన్నేళ్లుగా కూలర్ల తయారీ వ్యాపారంలో ఉన్నాను. ఫైబర్ కూలర్లతో పోలిస్తే ఎంతో నాణ్యంగా అసెంబుల్డ్ (ఐరన్) కూలర్లను తయారు చేసేందుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాం. ఎంతో మందికి ఉపాధి అవకాశాన్ని ఈ కూలర్ల తయారీ రంగం దిక్సూచిగా నిలుస్తోంది. ఎండాకాలం రావడంతో కూలర్ల డిమాండ్ పెరిగింది. ప్రతీరోజు కూలర్ల అమ్మకాలు జరుగుతుండడంతో గిరాకీ బాగా పెరిగింది.
– సిరిపురం వసంత్, కూలర్ల తయారీ వ్యాపారి, మల్లాపూర్

రోడ్లపైనే ధాన్యం ఆరబోత


పెగడపల్లిలో ప్రధాన రహదారిపై ఆరబోసిన ధాన్యం

పెగడపల్లి: మండలంలో యాసంగి సీజన్‌లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే కొనుగోలు కేంద్రాల్లో స్థలం కొరత నెలకొంది. దీంతో పలు గ్రామాల్లోని రైతులు ధాన్యాన్ని ఆరబోసేందుకు తప్పని పరిస్థితుల్లో రోడ్లను ఆశ్రయిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయక పోతుండటంతో రాత్రివేళల్లో ప్రయాణించే వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశముంది. ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు ఏర్పాట్లు చేయాలని మండల ప్రజలు అధికారులను కోరుతున్నారు. గతంలో ఉపాధిహామీ పథకంలో సిమెంట్ కల్లాల నిర్మించుకునే అవకాశం ఉండేది. కల్లాలు నిర్మించుకున్న రైతులకు కల్లం నిర్మాణ పరిమాణం బట్టి రూ. 35 వేల నుంచి రూ. 75 వేల వరకు చెల్లించేంది. ఉపాధిహామీ నిధులు కల్లాల నిర్మాణానికి వాడొద్దని కేంద్రం నిబంధన పెట్టడంతో ఈ పథకం నిలిచిపోయింది. రైతులు తప్పని పరిస్థితుల్లో రోడ్లపైనే ధాన్యం ఆరబెట్టాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. గతంలో నిర్మాణాలు చేసిన వాటిలో కొన్నింటికి బిల్లులు కూడా రాలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ వెసులుబాటు ఉపాధిహామీలో లేకుండా పోయింది. ఇప్పటికైనా ఉపాధిహామీ లో కల్లాల నిర్మాణం పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

కరాటే పోటీల్లో నందగిరి యువకుల ప్రతిభ


సర్టిఫికెట్లతో రాకేశ్, గౌతమేశ్వర్

పెగడపల్లి: మండలంలోని నందగిరి గ్రామానికి చెందిన యువకులు గాజుల రాకేశ్, గాజుల గౌతమేశ్వర్ కరాటే పోటీల్లో ప్రతిభ చాటారు. ఆదివారం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో హైరెంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు వారు నిర్వహించిన పోటీల్లో రాకేశ్, గౌతమేశ్వర్ పాల్గొని సత్తాచాటారు. ఈ మేరకు నిర్వాహకుల నుంచి వరల్డ్ రికార్డు సర్టిఫికెట్లు అందుకున్నారు. కరాటేలో ప్రతిభ చూపి వరల్డ్ రికార్డు పొందిన యువకులను గ్రామస్తులు అభినందించారు.

బ్రౌన్ బెల్ట్‌లు సాధించిన కరాటే విద్యార్థులు
ఇబ్రహీంపట్నం: జగిత్యాలలో జేకేఏ ఇండియా షోటోఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బ్రౌన్ బెల్ట్ ఎంపికకు పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలో ఇబ్రహీంపట్నంకు చెందిన వి. ఆర్పిత్, ఎ. రుషికేష్, జె. హర్షవర్ధన్ బ్రౌన్‌బెల్ట్‌కు ఎంపికైనట్లు కరాటే జగిత్యాల జిల్లా ప్రధాన శిక్షకుడు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బ్రౌన్ బెల్ట్ సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రధాన శిక్షకుడు రాపోలు సుదర్శన్ మాస్టర్ ప్రశంసా పత్రాలు, బెల్ట్‌లు, పతకాలు అందించారని ఆయన తెలిపారు.

భారతీయ గ్రామీణ డాక్ కర్మచారి సంఘ్ కమిటీ

జిల్లా కన్వీనర్‌గా భోగ సత్తన్న

జగిత్యాలటౌన్: భారతీయ గ్రామీణ డాక్ కర్మచారి సంఘ్ కమిటీ జిల్లా కన్వీనర్‌గా భోగ సత్తన్న ఎన్నికయ్యారు. భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) అనుబంధ భారతీయ గ్రామీణ డాక్ కర్మచారి సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమావేశం ఆదివారం జగిత్యాల వైశ్య భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్‌గా భోగ సత్తన్న, సభ్యులుగా జి తిరుపతి, కదారి అజయ్, మెరుగు శంకరయ్య, రామడుగు సుధాకర్, అణుగు రాజేశ్వర్‌రెడ్డి,నందెల్లి ప్రకాష్‌రావు, చంద్రశేఖర్, రాకేశ్‌ను నియమించారు.

మద్యానికి బానిసై కూలీ మృతి
రాయికల్: మద్యానికి బానిసై ఉపాధి కూలీ కురిసెంగ బోజ్జి రావు (45) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై సుధీర్ రావు ఆదివారం తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలం చెందిన బోజ్జి రావు రెండు నెలల క్రితం రాయికల్ కు వచ్చి ఉపాధి కూలీగా పనిచేసుకుంటున్నారు. వచ్చిన డబ్బుతో ప్రతిరోజు మద్యం తాగుతూ పట్టణంలో తిరిగేవాడు. పట్టణంలోని మూడు బొమ్మల రోడ్డు పక్కన పడిపోయి ఉండడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో 108 అంబులెన్స్ లో జగిత్యాల తరలించగా మృ చెందినట్లు వైద్యులు తెలిపారు.

రాయికల్‌లో ఈదురుగాలులు
రాయికల్: పట్టణంతో పాటు మండలంలో పలు గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో ఆలూరులో వరిపంట నెలకొరగగా మామిడికాయలు నేల రాలాయి. పశువుల ఆస్పత్రి ఏరియాలో భారీగా ఉన్న తాటి చెట్టు పడిపోవడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

ఐఎంఏ ఆధ్వర్యంలో జిమ్ఖాన్ 2025


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: పట్టణంలోని విరూపాక్షి గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన జిమ్ఖాన్ కాన్ఫరెన్స్ 2025తో పాటు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల ఆధ్వర్యంలో నిర్వహించిన 24వ స్టేట్ వర్కింగ్ కమిటీ సమావేశానికి జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్‌కుమార్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రతినిధులు వైద్యులు పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వంలో స్వర్ణయుగం


మాట్లాడుతున్న డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి: వచ్చే మూడేండ్ల కాలంలో కేసీఆర్ నాయకత్వంలో స్వర్ణయుగం రాబోతుందని డీసీఎమ్మెస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మపురి పట్టణంలో ఆదివారం బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. గత ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేకమైన మోస పూరిత వాగ్దానాలతో అధికారం చేజిక్కుకుందని ప్రభుత్వ పాలన చేతగాక వాగ్దానాలన్నింటిని కుదేల్ చేస్తూ తెలంగాణ ప్రజానికానికి శనిలా పట్టుకుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సంగి సత్తమ్మ, మాజీ వైస్ చైర్మన్ రామన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విజయ్‌రెడ్డి

రాయికల్: మండలంలోని కిష్టంపేటలోని జగిత్యాలలోని వెంకటేశ్వర ఆర్థో ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ విజయ్‌రెడ్డి వంద మందికి ఉచితంగా ఆర్థో పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు జాన స్వరూప, తంగెళ్ల రమేశ్, సిరిపురం సత్తయ్య,ఆర్ఎంపీలు తదితరులు పాల్గొన్నారు.



సాక్షి స్పందన

లీకేజీకి మరమ్మతు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం పెర్కపల్లి గ్రామ శివారులో శనివారం మిషన్ భగీరథ పైపులైను పగిలి నీరు వృథాగా పోతుండగా, సాక్షిలో వాట్సాప్ శీర్షికలో ‘వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు’ అని ఫొటో స్టోరీ ప్రచురితం కాగా, స్పందించిన అధికారులు పైపులైను మరమ్మతులు చేపట్టి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేశారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు


పెగడపల్లిలో జెండా ఎగురవేస్తున్న నాయకులు


కథలాపూర్ మండలం భూషణరావుపేటలో..

రాయికల్/కథలాపూర్/మల్లాపూర్/పెగడపల్లి: బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలను ఆదివారం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. రాయికల్ పట్టణం, మండలంలోని అన్ని గ్రామాలు, కథలాపూర్, మల్లాపూర్, పెగడపల్లి మండలాల్లోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాలను నాయకులు ఆవిష్కరించారు. స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పలు గ్రామాల నుంచి నాయకులు ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివెళ్లారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు


జగిత్యాల నుంచి ఎల్కతుర్తి సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

జగిత్యాలటౌన్: వరంగల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జగిత్యాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో ఆదివారం తరలివెళ్లారు.

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల నుంచి..
సారంగాపూర్: బఆర్ఎస్ రజతోత్సవ సభకు సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. రెండు మండలాల నుండి 2 వేల మందికి పైగా పార్టీ సమావేశానికి వెళ్లినట్లు మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు తేలు రాజు, నేరెల్ల సుమన్‌గౌడ్, తదితరులు పేర్కొన్నారు.


మల్యాల నుంచి బయలుదేరుతున్న నాయకులు


మల్యాల: మండలంలోని వివిధ గ్రామాల నుంచి వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్‌స్కూల్ అర్హత పరీక్ష


విక్టరీ సింబల్ చూపిస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో ఆదివారం 6వ తరగతిలో చేరేందుకు అర్హత పరీక్షను నిర్వహించారు. 6వ తరగతిలో 100 సీట్లు ఉండగా, 108 మంది అర్హత పరీక్ష రాసేందుకు దరఖాస్తులు చేసుకోగా, 98 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపారు.

గడిద్వారం ఇక జ్ఞాపకమేనా..?



బుగ్గారం: పల్లెల్లో ఎంతో దర్పంగా కనిపించిన గడీలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతున్నాయి. అనేక గ్రామాల్లో వాటి ఆనవాళ్లు చెరిగిపోయాయి. బుగ్గారం మండలకేంద్రంలోని గడి పూర్తిగా తొలగిపోగా.. ద్వారం మాత్రం ఇప్పటికీ ఠీవీగా దర్శనమిస్తోంది. అయితే ఆ స్థలంలో ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తుండడంతో ఈ ద్వారాన్ని మరమ్మతు చేసి అలాగే ఉంచుతారా..? లేక పూర్తిగా తొలగిస్తారా..? అని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి


డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

కథలాపూర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని ఎస్సై నవీన్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని మాస్ట్రో కిడ్స్ ప్లే స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం రాత్రి నిర్వహించారు. ప్రతీ వ్యక్తికి విద్యార్థి దశ కీలకమని, ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, హెచ్ఎం రంజిత్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కోరుట్ల: వారంతా 50 ఏళ్ల కిందటి చిన్న నాటి స్నేహితులు, 1974–75 వ సంవత్సరంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదో తరగతి చదువుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. 50 ఏళ్ల తర్వాత ఆదివారం ఒకే చోట కలుసుకున్నారు. అందుకు పట్టణంలోని పీబీ గార్డెన్ వేదికైంది. చిన్న నాటి చిలిపి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో 68 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.
ధర్మపురి: పట్టణంలోని శ్రీ చైతన్య విద్యా భారతి పాఠశాలకు చెందిన 2005–2006 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు నేర్పిన గురువులను పూలమాల శాల్వాలతో సన్మానించారు.